

10లో

## ఘనంగా నవరాత్రి మహోత్సవాలు

- అమ్మ వార్లకు లక్షపుష్పార్చనలు
- వేలాదిగా హాజరైన భక్తులు





పాఠకులకు, ప్రకటనకర్తలకు,
జర్నలిస్టు మిత్రులకు, అధికారులకు,
ప్రజా ప్రతినిధులకు, నాయకులకు,
వ్యాపార వాణిజ్యవేత్తలకు,
**రంజాన్ పర్వదిన శుభాకాంక్షలు**


పండుగ సందర్భంగా గురువారం కార్యాలయానికి సెలవు.. పున: దర్శనం శుక్రవారం



# వరంగల్ వాయిస్

www.warangalvoice.net
Evening Daily

వరంగల్ | సంపుటి : 03 | సంచిక : 251 | బుధవారం | 10 ఏప్రిల్ 2024 | పేజీలు : 10 | వెల రూ. 5


# మెట్టురామన్న ఆస్తులపై కన్ను..?





- నిధులు కొల్లగొట్టేందుకు కుట్ర
- రాజకీయనేతల అండతో అడుగులు
- తమకేమీ పట్టనట్టు వ్యవహరిస్తున్న దేవాదాయ శాఖ అధికారులు
- కోట్ల ఆస్తులున్నా ఆలయ కమిటీ, పూర్తి స్థాయి ఈఓ లేని వైనం

కాజీపేట సమీపంలోని మెట్టుగుట్టపై భక్తుల కొంగు బంగారంగా విరాజిల్లుతున్న శ్రీ సీతారామచంద్ర స్వామి దేవస్థానం ఉనికికే ప్రమాదం పొంచి ఉందా..? త్వరలో ఈ ఆలయం ఆనవాళ్లు లేకుండా చేస్తున్నారా..? ఇందుకు దేవాదాయ, ధర్మాదాయ శాఖ అధికారులు సైతం తమవంతు సహాయ సహకారాలు అందిస్తున్నారా అంటే అవుననే సమాధానమే వస్తుంది. నిత్యం శ్రీ సీతారామచంద్ర స్వామిని దర్శించుకునే భక్తులు, పూజారులు తమ దేవుడికి ప్రమాదం పొంచి ఉందని ఆరోపిస్తున్నారు. సీతారామచంద్ర స్వామి పేరున అయోధ్యపురం గ్రామంలో ఉన్న వందల ఎకరాల భూమితోపాటు కోట్ల రూపాయల బ్యాంక్ నిల్వలను కొల్లగొట్టేందుకు కొందరు ప్రయత్నిస్తున్నారంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వీరికి రాజకీయ నాయకుల అండదండలు మెండుగా ఉన్నాయంటూ విమర్శిస్తున్నారు. అయితే ఆలయ ఆస్తులను రక్షించాల్సిన దేవాదాయ శాఖ అధికారులు సైతం అక్రమార్కులకు వంత పాడుతున్నట్లు సమాచారం. కుట్రలో భాగంగానే ఆలయాలకు గత కొంత కాలంగా కమిటీలు ఏర్పాటు చేయడం లేదంటూ మండిపడుతున్నారు. వందల ఏళ్ల చరిత్ర కలిగిన శ్రీ సీతారామచంద్ర స్వామి ఆలయ ఆస్తులను పరిరక్షించాల్సిన బాధ్యత దేవాదాయ శాఖపైనే ఉందంటున్నారు. - వరంగల్ వాయిస్, మడికొండ

వివరాలు 2లో..



## అవి మల్లె మొగ్గలు కావు..

ఒకే మల్లె మొక్కకు వందల మొగ్గలు వేసినట్లు కనిపిస్తున్న ఈ అపురూప దృశ్యం అందరినీ ఆకట్టుకుట్టోంది. అయితే ఇవి నిజంగా మల్లె మొగ్గలే అనుకుంటే మీరు పొరబడినట్లే. వరంగల్ పట్టణ పరిధిలోని 16వ డివిజన్ కీర్తి నగర్ లోని పోచమ్మగుడి సమీపంలో నిత్యం వందల కొంగలు గుంపులుగా చేరి కనువిందు చేస్తున్నాయి. వేసవి కాలం నేపథ్యంలో ప్రతి రోజు సాయంత్రం ఇలా ఎక్కడినుంచో కొంగలు గుంపులుగా వచ్చి ఉదయమే తిరిగి వెళ్లి పోతున్నాయని స్థానికులు వెల్లడిస్తున్నారు. - వరంగల్ వాయిస్, కాశిబుగ్గ

## 12న నగరానికి రానున్న విజయా నంద తీర్థ స్వామీ



8లో



5లో

## ఘనంగా కడియం కావ్య జన్మదిన వేడుకలు

- మల్లికాంబ మనోవికాస కేంద్రంలో కేక్ కటింగ్
- హాజరైన పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు

# మెట్టు రామన్న ఆస్తులపై కన్ను?



**నిధులు కొల్లగొట్టేందుకు కుట్ర**

**రాజకీయనేతల అండతో అడుగులు**

**తమకేమీ పట్టనట్టు వ్యవహరిస్తున్న దేవాదాయ శాఖ అధికారులు**

**కోట్ల ఆస్తులున్నా ఆలయ కమిటీ, పూర్తి స్థాయి ఈఓ లేని వైనం**



**వరంగల్ వాయిస్, మడికొండ :** దక్షిణ కాశీగా, హరిహర క్షేత్రంగా విరాజిల్లుతున్న మెట్టుగుట్టపై శ్రీ మెట్టు రామలింగేశ్వర స్వామి, శ్రీ సీతారామచంద్ర స్వామి కొలువై భక్తులచే పూజలు అందుకుంటున్నారు. ఎన్నో ఏళ్ల చరిత్ర కలిగిన ఈ గుట్టపై రామలింగేశ్వర స్వామి, శ్రీ సీతారామచంద్ర స్వామి దేవాలయాలు వేర్వేరుగానే ఉండేవి. మెట్టగుట్ట శ్రీ సీతారామచంద్ర స్వామి పేరు మీద అయోధ్యపురం గ్రామంలో 500 ఎకరాల తరి, ఖుష్కీ భూములు ఉండగా, రామలింగేశ్వర స్వామికి మాత్రం భక్తులే ఆస్తి, పాస్తులుగా ఉండేవారు. గతంలో ఈ రెండు ఆలయాలకు వేర్వేరు కమిటీలు ఉండేవి. ఏ ఆలయ కమిటీ వారి ఆలయ అభివృద్ధికి కృషి చేసేవారు. అయితే జనాభా పెరిగి భూముల ధరలకు రెక్కలు రావడంతో శ్రీ సీతారామచంద్ర స్వామి ఆస్తులపై రాజకీయ నాయకుల కన్ను పడింది. వాటిని కొల్లగొట్టేందుకు కుట్రలు, కుతంత్రాలు పన్నుతున్నారన్న ప్రచారం సాగుతోంది. రెండు ఆలయాలను ఒక్కటిగా పరిగణించడం ద్వారా తమ పని సులువవుతుందన్న భావనతో అడుగులు వేస్తున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. రాజకీయ నేతల కుట్రలతో శ్రీ సీతారామచంద్ర స్వామి కనుమరుగయ్యే ప్రమాదం పొంచి ఉందని భక్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

## రూ.20 కోట్ల బ్యాంక్ బ్యాలెన్స్..

వాస్తవానికి మెట్టగుట్ట శ్రీ సీతారామచంద్ర స్వామి పేరు మీద అయోధ్యపురం గ్రామంలో సుమారు 500 ఎకారాల తరి, ఖుష్కీ భూములు ఉన్నాయి. 2015 లో అప్పటి రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలతో రైల్వే వ్యాగన్ ఫ్యాక్టరీ నిమిత్తం 54 ఎకరాల భూమిని రాష్ట్ర దేవాదాయ, ధర్మాదాయ శాఖ అధికారులు రైల్వే శాఖకు కేటాయించారు. ఇందుకుగాను అడ్వాన్స్ రూపేనా రూ.18 కోట్లను రైల్వే శాఖ దేవాదాయ శాఖకు కేటాయించింది. ఈ మొత్తాన్ని జిల్లా కలెక్టర్ సూచనల మేరకు అప్పటి ఆంధ్రాబ్యాంక్ ప్రస్తుతం యూనియన్ బ్యాంక్ లో ఫిక్స్ డిపాజిట్ చేశారు. దీనిపై అప్పటినుంచి వచ్చిన వడ్డీ కలిపితే మొత్తం రూ.20కోట్లకు పైనే బ్యాంకులో నిలువ ఉంటుందని భావిస్తున్నారు.

## నిధులు దుర్వినియోగం..

అయితే అప్పటి నుంచి మెట్టు రామలింగేశ్వర స్వామి ఆలయం పేరు చెపుతూ శ్రీ సీతారామచంద్ర స్వామి దేవాలయం నిధులను అధికారులు దుర్వినియోగం చేస్తున్నారంటూ స్థానికులు, భక్తులు ఆరోపిస్తున్నారు. వాస్తవానికి రామాలయం నిధులతో రామలింగేశ్వర స్వామి ఆలయానికి ఎలాంటి సంబంధం లేకున్నా దేవాదాయ అధికారుల నిర్లక్ష్యంతో కోట్ల రూపాయలు దుర్వినియోగానికి పాల్పడ్డారంటూ విమర్శిస్తున్నారు. ఈ విషయంలో భక్తులను, పూజారులను సైతం మభ్యపెట్టారన్న ఆరోపణలున్నాయి.

## కమిటీ లేదు..

మెట్టుగుట్టపై ఉన్న శ్రీ మెట్టు రామలింగేశ్వర స్వామి, శ్రీ సీతారామచంద్ర స్వామి దేవాలయాలకు గతంలో వేర్వేరుగా కమిటీలు ఉండేవి. ఏ దేవాలయానికి చెందిన కమిటీ వారి ఆలయ అభివృద్ధికి కృషి చేసేవారు. శ్రీరామ నవమికి శ్రీ సీతారామచంద్ర స్వామి కల్యాణాన్ని అంగరంగ వైభవంగా నిర్వహిస్తే, శివరాత్రికి శ్రీ మెట్టు రామలింగేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు, కల్యాణం నిర్వహించేవారు. కోట్ల రూపాయల ఆస్తులున్న ఈ ఆలయాలకు కమిటీలను ఏర్పాటు చేయడంతో దేవాదాయ శాఖ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్న ఆరోపణలున్నాయి. కనీసం పూర్తి స్థాయి కార్యనిర్వహణాధికారి కూడా లేకపోవడంపై భక్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కేవలం ఇంచార్జి ఈఓలతోనే నెట్టుకొస్తున్నారంటూ మండిపడుతున్నారు.

## గతంలో లేనిది ఇప్పుడెందుకు..

### – అర్చకులు పరాశరం రామాచార్యులు

మెట్టుగుట్టపై 2014కి ముందు భక్తులు, దాతల సహకారంతో ఉత్సవాలు నిర్వహించుకునే వారనీ రామాలయ వంశపారంపర్య అర్చకులు పరాశరం రామాచార్యులు తెలిపారు. అప్పుడు కలిపే ఆలోచన లేని అధికారులు, ఇప్పుడు ఆ దిశగా అడుగులు ఎందుకు వేస్తున్నారని ప్రశ్నించారు. రాముడికి కొన్ని కోట్ల రూపాయలు రాగానే ఇప్పుడు రెండు దేవాలయాలను ఒక్కటి చేసే ఆలోచనలు చేస్తున్నారని దుయ్యబట్టారు. దీనిలో ఏదో కుట్రలు దాగి ఉందన్నారు. అందులో భాగంగానే గతంలో రెండు దేవాలయాలకు రెండు వేరు వేరే కమిటీలు ఉండగా గత కొన్ని సంవత్సరాలుగా ఒకటే కమిటీ వేయడం జరుగుతుందన్నారు. శ్రీ సీతారామచంద్ర స్వామి దేవాలయంపై కుట్రలు చేయడం మంచిది కాదన్నారు.

# కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలి

**బీజేపీ వరంగల్ పార్లమెంట్ అభ్యర్థి ఆరూరి రమేష్**



**వరంగల్ వాయిస్, తొర్రూర్ :** దేశం సుభిక్షంగా. ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలంటే మూడో సారి నరేంద్ర మోడీ ప్రధాని కావాలని ప్రజలంతా కోరుకుంటున్నారని, అందుకు పార్టీ శ్రేణులు సైనికుల్లా పనిచేయాల్సిన అవసరం ఉందని వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గ బీజేపీ అభ్యర్థి ఆరూరి రమేష్ పిలుపునిచ్చారు. మహబూబాద్ జిల్లా తొర్రూరులోని వెంకటేశ్వర కళ్యాణ మండపంలో బుధవారం పెద్దవంగర, రాయపర్తి, తొర్రూరు మున్సిపాలిటీ, తొర్రూరు పరిధిలోని మండలాల బీజేపీ కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. గత పది సంవత్సరాల పాలనలో అవినీతి లేని పాలనను అందించి అంతర్జాతీయ స్థాయిలో భారతదేశానికి కీర్తి ప్రతిష్టలు తీసుకొచ్చిన ఘనత మన ప్రధాని నరేంద్ర మోడీకి దక్కుతుందన్నారు. గతంలో ఇక్కడి నుంచి ప్రాతినిధ్యం వహించినవారు ఈ ప్రాంత అభివృద్ధికి ఎలాంటి కృషి చేయకపోయినా ఈ ప్రాంత అభివృద్ధికి మోడీ కృషి చేశారని, ఈసారి తనను ఆశీర్వదించి గెలిపిస్తే ప్రధాని మోదీ ఆధ్వర్యంలో వరంగల్ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. అందులో భాగంగా మామునూరు విమానాశ్రయం, వరంగల్ ఏనుమాములలో ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమ, పాలకుర్తిలో స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ తో పాటు మోడల్ పార్లమెంట్ నియోజకవర్గంగా అభివృద్ధి చేసి చూపిస్తానని హామీ ఇచ్చారు. ప్రజల కష్టసుఖాలు తెలిసిన వ్యక్తిగా, నాయకులు, కార్యకర్తలను సమన్వయం చేసుకొని, ఈ ప్రాంత అభివృద్ధిలో తన వంతు కృషి చేసేందుకు మీ ఆశీర్వాదాలు అందించాలని కోరారు. అనంతరం రాయపర్తి మండలానికి చెందిన మాజీ ఎంపీపీ రాంబాబు, తొర్రూరు పట్టణానికి చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకులు చలువాది సత్యనారాయణ తదితరులకు బీజేపీలో చేరగా వీరికి అరూరి రమేష్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో పార్లమెంట్ ప్రాభారీ మురళీధర్ గౌడ్, మాజీ ఎమ్మెల్యేలు వన్నాల శ్రీరాములు, డాక్టర్ టి.రాజేశ్వరరావు, మార్తినేని ధర్మారావు, జనగామ జిల్లా అధ్యక్షులు దశమంత రెడ్డి, నాయకులు లేగ రామ్మోహన్ రెడ్డి, పార్లమెంటు కన్వీనర్ కుమారస్వామి, అసెంబ్లీ కన్వీనర్ శ్రీమాన్, జాయింట్ కన్వీనర్ కోటేశ్వర్, ఎంపీటీసీ జాన్సి, మండల అధ్యక్షులు, బూత్ స్థాయి అధ్యక్షులు, కన్వీనర్లు తదితరులు పాల్గొన్నారు.

# రేపు ఈద్-ఉల్-ఫితర్

**ముస్లింలలో వెల్లివిరిసిన ఆనందం**

**ప్రార్థనలకు ముస్తాబైన ఈద్గాలు, మసీదులు**



**వరంగల్ వాయిస్, చెన్నారావుపేట :** నెలవంక దర్శనమిచ్చింది. ముస్లింలు ఎంతో పవిత్రంగా భావించే రంజాన్ పండుగ (ఈద్–ఉల్–ఫితర్) వేడుకలను నేడు గురువారం ఘనంగా జరుపుకొనున్నారు. బుధవారం రాత్రి నెలవంక దర్శనం కావడంతో ఇస్లాం సాంప్రదాయ లోగిళ్ళలో ఆనందం వెల్లివిరిసింది. నెలవంక పొడుపుతో ప్రారంభమైన ఉపవాస దీక్షలు... మళ్లీ నెలవంక దర్శనం ఇచ్చేవరకు నెలరోజుల పాటు కఠోర ఉపవాస దీక్షలు చేపట్టిన ముస్లింలు బుధవారం సాయంత్రం నెలవంకను చూసి స్థానిక మసీదులలో తమ కఠోర ఉపవాస దీక్షలను విరమించుకున్నారు. ముస్లింలు అత్యంత వైభవంగా జరుపుకునే పండుగలలో రంజాన్ అతిపెద్ద పండుగ. మహమ్మద్ ప్రవక్త దేవదూతగా ప్రపంచానికి శాంతి సందేశాన్ని అందించిన సందర్భమే రంజాన్. దీన్ని ఆయన ఖురాన్ రూపంలో పవిత్రంగా అందజేశారని ఇస్లామీలు చెబుతారు. రంజాన్ సందర్భంగా ముస్లింలు నిర్వహించే ప్రత్యేక ప్రార్థనల కోసం ఇప్పటికే జిల్లాలోని నగరాలు, పట్టణాలు, మండలాలు, గ్రామాల్లోని ఈద్గాలు, మసీదులు ముస్తాబై సిద్ధంగా ఉన్నాయి.



## బిర్యానీ గుమగుమల..

30 రోజుల ఉపవాస దీక్షల ఉపసంహరణ ఈద్–ఉల్–ఫితర్. అల్లా దేవుడు చెప్పిన కఠోర పరీక్షలను ఎదుర్కొని నీతి, నియమాలను ఆచరిస్తూ నిండైన ఆత్మవిశ్వాసంతో హరి అరివిరిసిన ఆనందంతో జరుపుకునేదే ఈద్–ఉల్–ఫితర్ పర్వదినం. రంజాన్ పండుగ నాడు ఎంత పేదవారైనా కొత్త దుస్తులు ధరించి అత్తరు సుర్మాలు పులుముకుని ఈద్గాలలో, మసీదులలో జరిగే ప్రార్థనల్లో పాల్గొంటారు. అక్కడ మత పెద్దలు వినిపించే ఖుత్బాను భక్తిశ్రద్ధలతో విని జీవితం సుఖసంతోషాలతో గడిచేలా చూడమని తమ ఆరాధ్య దైవమైన అల్లాను నమాజ్ (ప్రార్థన) ద్వారా వేడుకుంటారు. నమాజ్ అనంతరం ఈద్ ముబారక్ అంటూ ఆత్మీయ ఆలింగనాలు చేసుకొని ఒకరినొకరు కలుసుకొని రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలుపుకుంటారు. ఈ సందర్భంలోనే మాటలు మానుకున్నా ఒక్క అలింగనంతోనే దగ్గర అయిపోతారు. కుల, మత, భేదం లేకుండా స్నేహితులను తమ ఇళ్ళలోకి ఆహ్వానించి సేమియా పాయసంను వడ్డించి బిర్యానీ గుమగుమల రుచి చూపిస్తారు.

## ఉచిత డయాబెటిక్ క్యాంప్




**వరంగల్ వాయిస్, వరంగల్ :** సంరక్ష హాస్పిటల్ ఆధ్వర్యంలో నగరంలోని కొత్తవాడ జంక్షన్ శ్రీ కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహం వద్ద బుధవారం 17వ ఉచిత డయోబెటిక్ క్యాంప్ నిర్వహించారు. ప్రజలు మధ్యాహ్నం ఎండలలో ఉష్ణోగ్రత ఎక్కువగా ఉన్నప్పుడు బయట తిరుగవద్దని, వడదెబ్బ తగలకుండా తగిన చర్యలు తీసుకోవాలని, మంచి నీరు, ద్రవ పదార్థాలు ఎక్కువగా తీసుకోవాలని ప్రజలను కోరారు. అదే విధంగా వరంగల్ ప్రజలు సంరక్ష హాస్పిటల్ వారి ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆరోగ్యవంతమైన సమాజం కోసం షుగర్ వ్యాధి పట్ల జాగ్రత్త వహించాలని సూచించారు. మారుతున్నఆహారపు అలవాట్లతో, సరైన వ్యాయమం లేకపోవటం వలన షుగర్ వ్యాధిన పడే వారి సంఖ్య పెరుగుతుందని తెలిపారు. కాబట్టి, ప్రతి ఒక్కరూ ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు తీసుకొని, షుగర్ టెస్ట్ రెగ్యులర్ గా చేయంచుకోవాలని సంరక్ష హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ దిడ్డి శ్రవణ్ కుమార్, వైస్ చైర్మన్ డాక్టర్ కాసర్ల తిరుపతి రెడ్డి, ముఖ్యులు పి. మహేశ్ సూచించారు. ఈ క్యాంప్ లో 91 మందికి రక్త పరీక్షలు నిర్వహించి వైద్య సేవలందించారు. తరువాతి క్యాంప్ 14న ఆదివారం రంగశాయిసేట జంక్షన్ లో నిర్వహించనున్నట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంరక్ష హాస్పిటల్ సిబ్బంది, రవి కిరణ్, సురేష్, సృజన్, మహేష్, రమేశ్, రమాదేవి, సుమలత, సారిక, రజిత, స్వర్ణలత తదితరులు పాల్గొని వైద్య శిబిరంలో సేవలందించారు.

## మైనారిటీ కుటుంబాలకు నిత్యావసరాల అందజేత



**వరంగల్ వాయిస్, వరంగల్ :** నగరంలోని 36వ డివిజన్ చింతల్, చంద్రవదన కాలనీ, ఆర్ఎస్ నగర్, పుప్పాలగుట్ట, ఏసీ రెడ్డి నగర్ వివిధ ప్రాంతాలలో బుధవారం సామాజికవేత్త, సుస్మిత గార్డెన్ యజమాని ఎల్ శ్రీనివాస్ రంజాన్ సందర్భంగా నిరుపేద మైనారిటీ కుటుంబాలకు 11 రకాల నిత్యావసర వస్తువులను సుమారు 120 కుటుంబాలకు వారి ఇంటికి వెళ్లి అందజేశారు.

## ఓటు వేయడం మన కర్తవ్యం

### సామాజికవేత్త నిమ్మల శ్రీనివాస్



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** ఓటరుగా నమోదు కావటం ప్రతి ఎన్నికలలో తప్పకుండా ఓటు హక్కు వినియోగించుకోవడం దేశ పౌరునిగా మన కర్తవ్యం అని ప్రముఖ సామాజికవేత్త నిమ్మల శ్రీనివాస్ అన్నారు. రానున్న లోక్ సభ ఎన్నికలలో ఓటరుగా నమోదు కావడానికి మరో ఆరు రోజులు అంటే ఈ నెల 15 వరకు అవకాశం మాత్రమే ఉందని యువత ముఖ్యంగా 18 సంవత్సరాల నిండిన వారందరూ కేవలం ఓ పదిహేను నిమిషాలు కేటాయించి ఈ ప్రక్రియ పూర్తి చేసుకోని రారున్న లోకసభ ఎన్నికలలో ఓటు హక్కు వినియోగించుకోవాలని ఆయన అన్నారు. స్మార్ట్ ఫోన్ లో కూడా ఆన్ లైన్ ద్వారా ఓటర్ గా నమోదు కావచ్చని లేదా దగ్గరలోని ఆన్ లైన్ సెంటర్ లో కూడా నమోదు చేసుకుని ఆయన అన్నారు. ఫామ్ 6లో పూర్తి వివరాలతో పాటు ధ్రువీకరణ పత్రాల జిరాక్స్ కాపీలు పాస్ పోర్ట్ ఫొటో జతపరిచి సంబంధిత బీఎల్వోకు అందచేసి ఓటర్ గా నమోదు కావచ్చునని ఆయన అన్నారు. ఓటరు జాబితాలో సవరణలకు, పేర్లు గల్లంతయిన వారు కూడా ఈ ప్రక్రియ సులభంగా పూర్తి చేసుకోవచ్చని ఆయన తెలిపారు. మే నెల 13న జరిగే లోకసభ ఎన్నికలలో ప్రతి ఒక్కరూ ఓటు హక్కును తమ బాధ్యతగా భావించి ఓటు వేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. రానున్న రోజులలో వివిధ స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులతో చర్చించి ఓటరు శాతం పెంచేందుకు అవగాహనా చైతన్య కార్యక్రమాలు నిర్వహించబోతున్నట్లు ఆయన తెలిపారు.

# విద్యార్థులు శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించుకోవాలి

### విశ్రాంత ఆచార్యులు లక్ష్మారెడ్డి




**వరంగల్ వాయిస్, చింతగట్టు :** విద్యార్థులు శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించుకోవాలని నిట్ విశ్రాంత ఆచార్యులు లక్ష్మారెడ్డి అన్నారు. జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి చెకుముఖి సంబరాల పోటీలో చింతగట్టు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రభుత్వ పాఠశాల విభాగంలో బహుమతి సాధించిన సందర్భంగా బుధవారం నాడు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పద్మ అధ్యక్షతన జరిగిన బహుమతి ప్రధానోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు శాస్త్రీయ అవగాహనను పెంపొందించుకోవడమే కాకుండా నిత్యజీవితంలో కూడా ఎదురయ్యే సమస్యల పరిష్కారానికి శాస్త్రీయంగా ఆలోచించాలన్నారు. జన విజ్ఞాన నివేదిక సంస్థ సమాజంలోని మూఢనమ్మకాల నిర్మూలనకు పాటుపడుతూ, విద్యార్థులలో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించడానికి ప్రతి సంవత్సరం రాష్ట్రస్థాయిలో చెకుముఖి టాలెంట్ టెస్ట్ నిర్వహిస్తు విద్యార్థులకు సైన్స్ పట్ల ఆసక్తిని కలిగించడానికి గత మూడు దశాబ్దాలుగా కృషి చేస్తుందన్నారు. జన విజ్ఞాన వేదిక హనుమకొండ జిల్లా కమిటీ ప్రధాన కార్యదర్శి రాష్ట్రపతి అవార్డు గ్రహీత పరికిపండ్ల వేణు మాట్లాడుతూ కూల్ డ్రింక్స్ తాగడం వల్ల కలిగే అనర్థాలను తెలుపుతూ, వివిధ రసాయన పదార్థాలతో తయారు చేసే శీతల పానీయాలు తాగడం వల్ల కలిగే అనర్థాల గురించి విద్యార్థులకు వివరించారు. సహజ పానీయాలైన చెరుకు రసం, నిమ్మరసం, కొబ్బరి నీళ్లు, మజ్జిగ, రాగి జావా అంబలి వంటివి తెలుసుకోవాలని సూచించారు. హనుమకొండ జిల్లా నుంచి చింతగట్టు పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయిలో బహుమతి సాధించినందులకు అభినందనలు తెలిపారు. బహుమతి సాధించిన విద్యార్థులుకు, గైడ్ టీచర్ రాజేందర్ కు సర్టిఫికెట్ల ప్రదానంతో పాటు సైన్స్ కిట్ బహుమతిని ప్రధానోపాధ్యాయురాలు పద్మకి జన విజ్ఞాన వేదిక వారు అందజేశారు. ఈ కార్యక్రమంలో అమ్మ ఆదర్శ కమిటీ చైర్మన్ కందగట్ల రమాదేవి, జన విజ్ఞాన వేదిక ఉపాధ్యక్షుడు ఉమామహేశ్వరరావు, ఉపాధ్యాయులు శరత్ బాబు, శేషగిరి, సాంబమూర్తి, అర్పిత, ప్రభ, విద్యార్థులు పాల్గొన్నారు.

## మోదీ నాయకత్వానికి ఆకర్షితులై బీజేపీలోకి చేరికలు

### ఎంపీ అభ్యర్థి సీతారాం నాయక్



**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పినపాక నియోజకవర్గం కార్కగూడెం మండలం కొత్తగూడెం, చొప్పల గ్రామల ప్రజలు మూకుమ్మడిగా బీజేపీలో చేరారు. వీరికి సీతారాం నాయక్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మోదీ నాయకత్వాన్ని బలపరుస్తూ మహబూబాబాద్ పార్లమెంట్ అభ్యర్థిగా నాకు మద్దతు తెలపడానికి ఇంత పెద్ద ఎత్తున బీజేపీలో చేరుతున్న ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు. ఈ పార్లమెంట్ ఎన్నికల్లో పార్టీ శ్రేణులు అహర్నిశలు నా గెలుపు కోసం కృషి చేయాలని, పార్టీలో చేరిన ప్రతి ఒక్కరిని కంటికి రెప్పలా కాపాడుకుంటానని అన్నారు. గ్రామాలలో ఉన్న సమస్యలను తెలుసుకొని సంబంధిత అధికారులతో ఫోన్ లో మాట్లాడి పరిష్కరించాలని కోరారు. పార్టీ గెలుపు కోసం ప్రతి కార్యకర్త సైనికుడిలా కృషి చేయాలని పిలుపునిచ్చారు.కేంద్ర ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలను గడపగడపకి తీసుకెళ్లాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు నాగేశ్వర్ రావు, జిల్లా అధికార ప్రతినిధి శ్రీరాం చంద్రయ్య, మండల ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## తాగునీటికి ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలి



**వరంగల్ వాయిస్, మల్హర్ :** ఎండల తీవ్రత ఎక్కువగా ఉన్న దృష్ట్యా గ్రామాల్లో తాగు నీటి సరఫరాలో ఎటువంటి ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలని భూపాలపల్లి జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా అధికారులను ఆదేశించారు. బుధవారం మండలంలోని లంబాడి తాండ, అన్సాన్ పల్లి, నాచారం, రుద్రారం గ్రామాల్లో తాగునీటి సరఫరా ప్రక్రియను వారు అధికారులతో కలిసి పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ గ్రామాల్లో ప్రతి ఇంటికి తాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలని, ఎండల తీవ్రత ఎక్కువగా ఉన్న దృష్ట్యా మిషన్ భగీరథ నీరు సరిపోని యెడల బోరు బావుల ద్వారా నీటి సరఫరాకు చర్యలు తీసుకోవాలని, అవసరం ఉన్న చోట బోరు బావుల కోసం ప్రత్యేక ప్రణాళిక సిద్ధం చేసి ప్రతిపాదనలు పంపించాలని, అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేసి వేసవిలో తాగునీటికి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ రవి కుమార్, ఎంపీడీవో శ్యామ్ సుందర్, ఆర్ డబ్ల్యూఎస్ ఏఈ హరిత, ఎంపీఓ విక్రమ్ కుమార్, ఆయా గ్రామాల కార్యదర్శులు, మిషన్ భగీరథ సిబ్బంది పాల్గొన్నారు.

# వ్యాధి మూలాన్ని గుర్తించేది హోమియోపతి

### డాక్టర్ పరికిపండ్ల అశోక్



**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** సూక్ష్మమైన హోమియోపతి గుళికతో అనితర సాధ్యమైన వ్యాధులను నయం చేయవచ్చునని, ప్రపంచంలో అతి తక్కువ ఖర్చుతో వ్యాధుల నుంచి శాశ్వతమైన పరిష్కారం చూపించే హోమియోపతి వైద్యాన్ని ప్రతి ఒక్కరు ఉపయోగించుకోవాలని హోమియోపతి మెడికల్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు, జాతీయ అవార్డు గ్రహీత డాక్టర్ పరికిపండ్ల అశోక్ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలో హోమియోపతి వైద్య ప్రదాత డాక్టర్ శామ్యూల్ హానిమన్ 269వ జయంతిని పురస్కరించుకొని "ప్రపంచ హోమియోపతి దినోత్సవం" సందర్భంగా హోమియోపతిక్ మెడికల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న డాక్టర్ పరికిపండ్ల అశోక్ మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా 158 దేశాల్లో ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలలో హోమియోపతి విద్యను అభ్యసిస్తున్నారని, భారతదేశంలో సుమారు 150 వైద్య కళాశాలలు, 40 పీజీ వైద్య కళాశాలలు ఉండటమే కాకుండా, సుమారు మూడు లక్షల మంది సుశిక్షితులైన హోమియోపతి వైద్యులు భారతదేశంలో హోమియోపతి వైద్య సేవలు అందిస్తున్నారని, ప్రపంచ హోమియోపతి దినోత్సవం సందర్భంగా రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో ఈ కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు. ఈ సందర్భంగా వారి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించి, మున్సిపల్ కార్మికులకు ఉచితంగా హోమియోపతి మందులను, టీ- షర్ట్స్ ఉచితంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత ఎన్ఎస్ఎస్ అధికారి కూతురు సత్యనారాయణ, అరవింద ఎడ్యుకేషన్ సొసైటీ అధినేత చంద్రదేవ్, సమాజ సేవకులు దైద వెంకన్న, బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షులు రామచంద్రరావు, ఆరోగ్య మిత్ర స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి సహజ, సుంకర సంపత్ కుమార్, బేతి సతీష్, యాకూబీ, రాజేందర్, సునీల్, భారతి, జ్యోతి, మున్సిపల్ కార్మికులు స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# పక్కా ప్రణాళికతో తాగునీటి సరఫరా

## ఇబ్బందులను సత్వరమే పరిష్కరించాలి
## రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి



**వరంగల్ వాయిస్, వరంగల్ :** తాగునీటి సరఫరాలో వచ్చే ఇబ్బందులను సత్వరమే పరిష్కరించాలని, ప్రజలకు ఎక్కడ ఎలాంటి ఇబ్బందులు రాకుండా జాగ్రత్తలు వహించాలని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి హైదరాబాద్ లోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సచివాలయం నుంచి రాష్ట్ర స్థాయి ఉన్నత స్థాయి అధికారులతో కలిసి వేసవిలో త్రాగునీటి సరఫరా ప్రణాళిక, ధాన్యం కొనుగోలు, పాఠశాలల్లో మౌళిక వసతుల కల్పనపై, వడదెబ్బ తగలకుండా తీసుకోవల్సిన జాగ్రత్తలపై జిల్లా కలెక్టర్ లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లా కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య, అదనపు కలెక్టర్ సంధ్యారాణి సంబంధిత అధికారులతో కలిసి ఈ వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ కార్యదర్శి శాంతి కుమారి మాట్లాడుతూ వేసవికాలం పూర్తి చేసుకోని వర్షాలు వచ్చేవరకు తాగునీటి సరఫరా అంశం పై అప్రమత్తంగా ఉండాలని, క్షేత్ర స్థాయిలో త్రాగు నీటి సరఫరాలో వచ్చే ఇబ్బందులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని అన్నారు. తాగునీటి సరఫరాకు సంబంధించి జిల్లాలో రూపొందించుకున్న ప్రణాళిక , నీటి సరఫరా లో ఎదురవుతున్న సమస్యలు, వాటిని పరిష్కరించేందుకు తీసుకుంటున్న చర్యలు , నీటి పునరుద్ధరణ వివరాలు మీడియాకు తెలియజేయాలని అన్నారు. త్రాగు నీటి సంబంధించి ప్రజలు ఎక్కడ ఆందోళనలు చేయాల్సిన అవసరం లేకుండా చూసుకోవాలని సీఎస్ తెలిపారు. వేసవి కాలంలో తాగునీటి సరఫరాకు సంబంధించి అవసరమైన అన్ని రకాల ఏర్పాట్లు పూర్తి చేసి సన్నద్ధంగా ఉన్నామని, ఇటీవల సామాజిక మాధ్యమాల్లో, వార్తా పత్రికలలో త్రాగునీటి సరఫరా ఇబ్బందుల గురించి వచ్చిన అంశాలను, వాటికి గల కారణాలు, ఆ సమస్యలను పరిష్కరించిన తీరు వివరాలను సీఎస్ అడిగి తెలుసుకున్నారు. రానున్న రెండు నెలల పాటు క్షేత్రస్థాయిలో తాగునీటి సరఫరా లో ఉత్పన్నమయ్యే సమస్యలను వెంటనే గుర్తించి వాటిని సత్వరం పరిష్కారం అయ్యే విధంగా చూడాలని, త్రాగునీటి సరఫరా ను ప్రతిరోజు పర్యవేక్షించాలని సీఎస్ పేర్కొన్నారు. ప్రత్యామ్నాయ ప్రణాళికలతో సిద్ధంగా ఉండాలని సూచించారు.

# ట్రాఫిక్ రూల్స్ అతిక్రమిస్తే చర్యలు తప్పవు
## కాజీపేట ట్రాఫిక్ ఇన్ స్పెక్టర్ పి.నాగబాబు



**వరంగల్ వాయిస్, కాజీపేట :** ఆటో డ్రైవర్ లు ట్రాఫిక్ రూల్స్ అతిక్రమిస్తే చర్యలు తప్పవని కాజీపేట ట్రాఫిక్ ఇన్ స్పెక్టర్ పి.నాగబాబు సూచించారు. బుధవారం కాజీపేట ట్రాఫిక్ స్టేషన్ పరిధిలోని మడికొండ, ధర్మసాగర్, సోమిడి, హనుమకొండ, కాజీపేట రైల్వే స్టేషన్లకు చెందిన ఆటో యూనియన్ లీడర్స్, ఆటో డ్రైవర్స్ కు ట్రాఫిక్ ఇన్ స్పెక్టర్ నాగబాబు కౌన్సిలింగ్ నిర్వహించడం జరిగింది. కౌన్సిలింగ్ లో ట్రాఫిక్ నిబంధనలు, అతివేగంగా ఆటో నడపడం వల్ల జరుగు ప్రమాదాల గురించి, ప్రజలకు ఆటోల వలన కలుగుతున్న ఇబ్బందుల గురించి ట్రాఫిక్ రూల్స్ పై ఆటో డ్రైవర్స్ కు కౌన్సిలింగ్ ఇచ్చి ఆటోలకు సంబంధించిన పత్రాలను తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో కాజీపేట ట్రాఫిక్ ఎస్ఐ ఉమాకాంత్, ఆర్ఎస్ఐ నాగరాజు, ట్రాఫిక్ సిబ్బంది పాల్గొన్నారు.

## శ్రీ మత్స్యగిరి స్వామి దేవాలయంలో పంచాంగ శ్రవణం



**వరంగల్ వాయిస్, శాయంపేట :** మండల కేంద్రంలోని అతి పురాతనమైన ఆరు శతాబ్దాల చరిత్ర గలిగిన శ్రీ మత్స్యగిరి స్వామి దేవాలయంలో ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని మంగళవారం సాయంత్రం దేవాలయ అర్చకులు ఆరుట్ల కృష్ణమాచారి పంచాంగ శ్రవణం చేశారు. వాఖ్యాత కాంతారావు ఉగాది పండుగ విశిష్టతను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో దేవాలయ చైర్మన్ సామల భిక్షపతి, గ్రామ పెద్దలు జిన్నా ప్రతాప్ సేనా రెడ్డి, గట్ల భగవాన్ రెడ్డి, అడ్వకేట్ లెక్కల జలంధర్ రెడ్డి, పాడి సమ్మిరెడ్డి, వినుకొండ శంకరాచారి, గిద్దమారి సురేష్, కానుగుల నాగరాజు, కడారి చంద్రమౌళి, అశోక్, సాంబయ్య, ఆనంద్, రాజు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## ఘనంగా శ్రీ క్రోధినామ పంచాంగ ఆవిష్కరణ



**వరంగల్ వాయిస్, భీమారం :** స్థానిక బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో భీమారంలోని అగస్త్య బ్రాహ్మణ భవనంలో శ్రీక్రోధినామ ఉగాది ఉత్సవ సభ మోత్కూరు మనోహర్ రావు అధ్యక్షతన ఘనంగా జరిగింది. ఈ సభకు ముఖ్య అతిథిగా పెండెం శేషగిరిరావు రిటైర్డ్ ప్రిన్సిపాల్ ప్రభుత్వ మహిళా కళాశాల వడ్డేపల్లి హాజరు కాగా, బ్రహ్మశ్రీ నాగిళ్ళ షణ్ముఖ పద్మనాభ శర్మ క్రోధినామ పంచాంగ పఠనం చేస్తూ దేశ కాలమాన పరిస్థితులు, వివిధ రాశుల వారికి ఆదాయ వ్యయాలు కందాయఫలాలు చక్కగా వివరించారు. పంచాంగ శ్రవణం ద్వారా కలిగే ఫలితాలను వివరించారు. సంఘకార్యదర్శి ముసిపట్ల శ్రీనివాస రావు 20వ సంఘ వార్షికోత్సవ నివేదికను విపులంగా వివరించారు. అంతర్జాతీయ మహిళాదనోత్సవాన్ని పురస్కరించుకొని వరిగొండ ఉమాదేవి, ఇందుర్తి జయశ్రీని సంఘ మహిళాసభ్యులు ఘనం సత్కరించారు. తదుపరి పంచాంగ ప్రచురణలో ఆర్థికంగ సహాయసహకారములు అందించిన కార్యవర్గ సభ్యులు జి.వి.రత్నాకర్ రావు, రవీందర్ రావు, నాగేందర్ రావు, సుదర్శన్ రావు, మల్లెల రంగారావు, జయశ్రీ, మనోహర్ రావు, జి.వి.ప్రసాద్ మొదలగు వారిన్ని పికలతో సత్కరించారు. మహిళా దినోత్సవ సందర్భంగ నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలలో పాల్గొని విజేతలుగానిలిచిన మహిళలకు ముఖ్యఅతిథి చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. జిల్లా ప్రముఖులు జి.జయప్రసాదరావు, గణపతిశర్మ, చకిలం సుధాకర్ రావు, మహేందర్ రావు, రాఘవరావు, దేవులపల్లి శ్రీకాంత్, వరంగల్ దర్శన్ ఎండీ.పెండెం రమేశ్‌బాబు, రాంమోహన్, చెంగల్ రావు, సుధాకర్ రావు, మహిళా సభ్యులు ఇందిర, సూర్యకుమారి, మమత, రాజకుమారి, అనిత, మహిత, శైలజ, శ్రీదేవి, విజయశ్రీ, వంద మందికి పైగా సభ్యులు పాల్గొనగా సభ్యులందరికి ఉగాది పచ్చడి అందజేశారు .

## జనావాసాల మధ్య ప్రమాదకరంగా విద్యుత్ లైన్



**వరంగల్ వాయిస్, మల్హర్ :** మండలంలోని కొండంపేట గ్రామ పంచాయతీ పరిధి కుంభంపల్లి గ్రామంలో జనావాసాల మధ్య 11కేవీ విద్యుత్ వైర్ ప్రమాదకరంగా ఉన్నప్పటికీ అధికారులు పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత 20 సంవత్సరాల క్రితం ఎర్త్ వైర్ గా ఉన్న విద్యుత్ లైన్ ను తాత్కాలికంగా 11కేవీగా మార్చి కుంభంపల్లి గ్రామానికి సింగిల్ ఫేస్ విద్యుత్ సరఫరా చేసిన అధికారులు అప్పటి నుంచి వైర్ ను మార్చక పోవడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని విద్యుత్ వైర్ సమీప ఇండ్ల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నాణ్యత లోపంలో గతంలో 3 సార్లు విద్యుత్ వైర్ తెగినప్పటికి తాత్కాలికంగా జాయింట్ లు వేశారు తప్ప, వైర్ ను మార్చలేదన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఎటువంటి ప్రమాదం జరగక ముందే పాత విద్యుత్ వైర్ స్థానంలో కొత్త వైర్ అమర్చాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.

## తెలంగాణ మైనారిటీ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో ఉచిత శిక్షణ

**వరంగల్ వాయిస్, ములుగు :** తెలంగాణ రాష్ట్ర మైనార్టీ స్టడీ సర్కిల్ మైనార్టీల సంక్షేమ శాఖ, హైదరాబాద్ వారు యూపీఎస్సీ సీసాట్-2025 పరీక్ష కోసం 2024-25 విద్యా సంవత్సరంలో మైనార్టీ అభ్యర్థులకు ఉచిత కోచింగ్ నిర్వహిస్తుంది. ఈ శిక్షణకు రిజర్వేషన్లు నియమం ప్రకారం మహిళా అభ్యర్థులకు 33.33 శాతం సీట్లు, అన్ని రిజర్వ్ కేటగిరీలలో వికలాంగులకు 5శాతం సీట్లు కేటాయించడం జరుగుతుంది. హైదరాబాదులోని తెలంగాణ రాష్ట్ర మైనారిటీ స్టడీ సర్కిల్ లో మొదటిసారి ప్రవేశం పొందే అభ్యర్థులందరూ ప్రవేశ పరీక్షకు దరఖాస్తు చేసుకోవాలని, ప్రవేశం పూర్తిగా మెరిట్ ప్రాతిపదికన ఉంటుందని తెలిపారు. యూపీఎస్సీ సీసాట్%--%2025 సివిల్ సర్వీసెస్ అప్టిట్యూడ్ టెస్ట్ లో ప్రవేశం కోసం తెలంగాణ రాష్ట్రంలోని అన్ని జిల్లాలోని సాధారణ ప్రొఫెషనల్ డిగ్రీ పూర్తి చేసిన మైనార్టీ అభ్యర్థుల ద్వారా ఆన్ లైన్ www.tmreistelangana.cgg.gov.in వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తులు స్వీకరించబడతాయి, దరఖాస్తులు స్వీకరించడానికి చివరి తేదీ 22-04-2024 వరకు పొడగించారు. ప్రవేశ పరీక్ష తేదీ 28-04-2024న అన్ని జిల్లా కేంద్రాల్లో గల తెలంగాణ మైనారిటీ రెసిడెన్షియల్ పాఠశాలలో నిర్వహించబడును. అభ్యర్థుల తల్లిదండ్రుల వార్షిక ఆదాయం 5 లక్షల కన్నా తక్కువ గా ఉండాలి. అర్హులైన ఆసక్తి కలిగిన మైనార్టీ విద్యార్థులు ఈ సదావకాశాన్ని సద్వినియోగం చేసుకోగలరని జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి, ములుగు ఈ.పీ.ప్రేమలత బుధవారం ఒక ప్రకటనలో తెలియజేశారు.

## మాజీ ఎంపీపీ కోతి ఉప్పలయ్య మృతి



**వరంగల్ వాయిస్, దేవరుప్పుల :** దేవరుప్పుల మాజీ ఎంపీపీ కోలుకొండ గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకుడు కోతి ఉప్పలయ్య మంగళవారం మృతి చెందారు. గత కొన్ని సంవత్సరాలుగా మెదడు కు సంబంధించిన వ్యాధితో చికిత్స పొందుతూ కన్నుమూశారు. బాపూజీ యువజన సంఘం వ్యస్థాపక అద్యక్షుడు, అగ్రగామి సంపాదకుడు కన్న పరశురాములు, పాము నారాయణ, ప్రస్తుత నాయకులు ముస్త్యాల సంతోష్ కుమార్, మునిగాల రాజశేఖర్, కన్న అబ్బాయిలు చీకట్ల కుమార స్వామి కోతి నాగరాజు, యామగాని అనీల్, హరిబాబు, ముత్యాల అరవింద్, బీసు అజయ్, కన్న నరేందర్ గౌడ్, గౌడ సంఘం అధ్యక్షుడు కన్న రామ్మూర్తి, కన్న వీర సోమయ్య, కాంగ్రెస్ పార్టీ నాయకుడు దామెర పెద్దులు, గ్రామ సర్పంచ్ కుర్నాల రవితో పాటు స్థానిక నాయకులు సంతాపం ప్రకటించారు.

## ముస్లింలకు నిత్యావసర సరుకుల పంపిణీ



**వరంగల్ వాయిస్, ఐనవోలు :** మండలంలోని గర్మిళ్లపల్లిలో ఎంపీటీసీ బీరం మౌనిక దేవేందర్ రెడ్డి ఆధ్వర్యంలో పవిత్ర రంజాన్ పండుగ సందర్భంగా ముస్లిం కుటుంబాలన్నింటికి (72 కుటుంబాలు) రంజాన్ పర్వదినం రోజున ఉపయోగపడే నిత్యావసర సరుకులు (సేమియా, చెక్కర, పాలు, కిస్మిస్, బాదం) అందజేశారు. అల్లా ఆశీర్వాదంతో ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని కోరుకోవడం జరిగింది. మైనారిటీ నాయకులు పాల్గొన్నారు.

## భౌతిక శాస్త్రంలో సతీష్ గౌడ్‌కు డాక్టరేట్



**వరంగల్ వాయిస్, మరిపెడ :** మరిపెడ ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ డిగ్రీ కళాశాలలో భౌతిక శాస్త్ర అధ్యాపకుడిగా పని చేస్తున్న జలగం సతీష్ గౌడ్ కు ఉస్మానియా విశ్వవిద్యాలయం భౌతిక శాస్త్ర విభాగంలో డాక్టరేట్ ను ప్రకటించింది. భౌతిక శాస్త్ర అసోసియేటెడ్ ప్రొఫెసర్ నాచగోని నర్సింలు మార్గదర్శకంలో లోహ ఆక్సైడ్ ల నానో కణాలను పీవీఏ మాత్రికలో చొప్పించిన నానో సంయోజకాల తయారీ, లక్షణీకరణ అనే అంశంపై 2018 నుంచి చేసిన పరిశోధనకు గాను డాక్టరేట్ ఆయనను వరించింది. సతీష్ గౌడ్ గత 20 సంవత్సరాల నుంచి అధ్యాపక వృత్తిలో కొనసాగుతూ పరిశోధనను కూడా కొనసాగించి, మారుమూల ప్రాంతం నుంచి డాక్టరేట్ సాధించటం పట్ల డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డా.కె వేణుగోపాల్ రావు, అధ్యాపక బృందం, హార్ట్ ఫుల్ నెస్ ధ్యాన శిక్షకులు నందిగామ జనార్దనాచారి, విద్యార్థులు, పలువురు ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేసి అభినందనలు తెలిపారు.

# నర్సరీలలో మొక్కలు ఎండిపోకుండా చూడాలి

## జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి



**వరంగల్ వాయిస్, ములుగు :** నర్సరీ, ఎవెన్యూ ప్లాంటేషన్ లలో మొక్కలు ఎండిపోకుండా చూడాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. బుధవారం కలేక్టరేట్ కాన్ఫరెన్స్ హల్ లో డీఆర్డీఏ పీడీ శ్రీనివాస్ కుమార్, ఏపీడీ వెంకటనారాయణలతో కలసి జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి ఏపీఓ, ఈసీలతో సమీక్షసమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రాబోయే వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని మొక్కలు నాటేందుకు నర్సరీలలో మొక్కల పెంపకం పెద్ద ఎత్తున చేపట్టాలని తెలిపారు. వేసవి ఉష్ణోగ్రతల వల్ల నర్సరీల్లో మొక్కలు చనిపోయే ప్రమాదం ఉన్నందున తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. జిల్లాలోని అన్ని నర్సరీలలో జామ, అల్లనేరేడు, అలోవెరా వంటి మొక్కలను పెంచాలన్నారు. మొక్కలు పెంపకం పని ప్రదేశాలలో కార్మికులకు తాగునీరు, నీడ టెంట్ ఏర్పాటు చేయాలని సూచించారు. ఉపాధి హామీ పథకంలో అన్ని మండలాల్లో ఎక్కువ పని దినాలు కల్పించే విధంగా చూడాలన్నారు. ఉపాధి హామీ పథకం ద్వారా జరిగిన పనులకు లేబర్ పేమెంట్, మెటీరియల్ పేమెంట్ వారంలోగా చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని అన్నారు. జిల్లాలోని బృహత్ పల్లె ప్రకృతి వనాలలో మొక్కలు చనిపోతే శాఖా పరమైన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లాలోని ఏపీఓలు, ఈసీలు తదితరులు పాల్గొన్నారు

# రాష్ట్ర స్థాయి అవార్డు అందుకున్న అలకనంద



**వరంగల్ వాయిస్, భూపాలపల్లి :** శ్రీ వివేకానంద సేవా సమితి భూపాలపల్లి జయశంకర్ జిల్లా ఆధ్వర్యంలో నిర్వహించిన ఉగాది రాష్ట్ర స్థాయి పురస్కారాలకు ఎంపికైన బేబీ బానోత్ అలకనంద రాథోడ్ స్వాగత నృత్యం సభికులను విశేషంగా ఆకట్టుకుంది. సంస్థ వ్యవస్థాపకుడు కొలుగూరి సంజీవరావు చిరంజీవి బానోత్ అలకనంద రాథోడ్ కు ఎన్ఎస్ ఆర్ అధినేతతో ఉత్తమ రాష్ట్ర స్థాయి నాట్య కళా ప్రవీణ అవార్డు అందించారు. ఈ సందర్భంగా ఎన్ఎస్ ఆర్ అధినేత సంపత్ రావు మాట్లాడుతూ జయశంకర్ భూపాలపల్లి జిల్లా, మలహర్ రావు మండలం, ఆన్ సాన్ పల్లి గ్రామానికి చెందిన బేబీ బానోత్ అలకనంద రాథోడ్ నృత్యం అద్భుతం అని కొనియాడారు. భవిష్యత్ లో నాట్యం లో జాతీయ,అంతర్జాతీయ, స్థాయి అవార్డులు పొంది తెలంగాణ రాష్ట్రానికి, జయశంకర్ భూపాలపల్లి జిల్లా ప్రాంతానికి గొప్ప పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కవులు, కళాకారులు, వేద పండితులు పాల్గొని బేబీ అలకనందను ఆశీర్వదించారు.

# సీఐ రవిరాజు ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు



**వరంగల్ వాయిస్, పరకాల :** పరకాల బస్టాండ్ ఆవరణలో పరకాల పోలీస్ వారి ఆధ్వర్యంలో పరకాల పట్టణ ప్రజలకు, ప్రయాణికులకు వేసవికాలం దృష్టిలో ఉంచుకొని దాహాన్ని తీర్చాలని ఉద్దేశంతో చలివేంద్రాన్ని ఏర్పాటు చేయడం జరిగింది. దీనిని పరకాల ఏసీపీ కిషోర్ కుమార్ బుధవారం ప్రారంభించారు. ఎండాకాలంలో ఎండలు మండుతున్నాయి కాబట్టి, వాటి నుంచి రక్షణ చర్యలలో భాగంగా ఎక్కువగా నీరు తీసుకుంటే ఆరోగ్యానికి మేలు అని, పోలీసు వారు ఏర్పాటుచేసిన చలివేంద్రం అందరూ ఉపయోగించుకోవాలని ప్రజలకు పోలీసులు విజ్ఞప్తి చేశర్నా. ఈ చలివేంద్రాన్ని ఏర్పాటు చేసిన పరకాల సీఐ రవిరాజును ఏసీపీ అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎస్సై రమేష్,హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాస్, కానిస్టేబుల్ దేవేందర్, రవీందర్, బస్టాండు సిబ్బంది, ప్రజలు, ప్రయాణికులు పాల్గొన్నారు.

# పారిశుధ్య కార్మికురాలిపై దాడి హేయం

**వరంగల్ వాయిస్, పరకాల :** పరకాల మున్సిపాలిటీలో పనిచేస్తున్న రోజువారి డ్యూటీలో ఉన్న చుక్క కమలపై పరకాల పట్టణంలోని కోర్టు ముందున్న కాలనీకి చెందిన మహిళలు చేసిన దాడిని పరకాల మండల, పట్టణ ఎస్సీ విభాగం ఖండించింది. రోడ్డు శుభ్రం చేస్తున్న క్రమంలో కమలకు దాహం వేయడంతో తాగునీటి కోసం వారిని అడిగితే వారు ఇలాంటి దాడి చేయడం హేయమైన చర్య అని అన్నారు. దాడి చేసిన సదరు మహిళలపై కేసు నమోదు చేసి చట్టపరమైన చర్య తీసుకోవానలి డిమాండ్ చేశారు.

# ఘనంగా గంటా రవికుమార్ జన్మదిన వేడుకలు



**వరంగల్ వాయిస్, వరంగల్ :** యువనేత, బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంటా రవికుమార్ జన్మదిన వేడుకలు బుధవారం ఘనంగా జరిగాయి. ఉదయాన్నే భద్రకాళి అమ్మవారి, గీత భవన్ శ్రీ వెంకటేశ్వర స్వామి, మెట్ల బావి దగ్గర ధన మైసమ్మ ఆలయంలలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం శివనగర్ లోని తన ఇంటి వద్ద రక్త దాన శిబిరంతో పాటు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. గత 30ఏళు గా తన జన్మదినం సందర్భంగా రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నారు. అలాగే పెద్ద ఎత్తున గంటా రవికుమార్ అభిమానులు, బీజేపీ నాయకులు, కార్యకర్తలు తరలివచ్చి జన్మదిన శభాకాంక్షలు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా బీజేపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున విచ్చేసి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం రక్తదానం



చేసిన వారికి గంటా రవికుమార్ రెడ్ క్రాస్ బ్లడ్ బ్యాంక్ ఆధ్వర్యంలో సర్టిఫికెట్ అందజేశారు. జిల్లాలోని పలుచోట్ల అభిమానులు, నాయకులు అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం గంట రవికుమార్ మాట్లాడుతూ తనకు జన్మదిన శుభకాంక్షలు తెలిపిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. అలాగే ప్రతి ఒక్కరూ రక్త దానం చేసి ఆపదలో ఉన్నవారిని కాపాడాలని కోరారు.

### బీజేపీ జిల్లా కార్యాలయంలో..

బీజేపీ జిల్లా పార్టీ కార్యాలయం ధర్మారం లో నాయకులు, కార్యకర్తల మధ్య గంటా రవికుమార్ జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. మండల, డివిజన్ అధ్యక్షులు, జిల్లా, రాష్ట్ర స్థాయి నాయకులు, కార్యకర్తలు అధికంగా విచ్చేసి కేక్ కట్ చేయించి జన్మదినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు.

# ఘనంగా కడియం కావ్య జన్మదిన వేడుకలు

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి డాక్టర్ కడియం కావ్య పుట్టినరోజు వేడుకలు కొలహాలంగా జరిగాయి. హనుమకొండలోని వారి నివాసంలో కడియం ఫౌండేషన్ ఆధ్వర్యంలో మల్లికాంబ మనోవికాస కేంద్రం



మానసిక వికలాంగ పిల్లలతో కలిసి కేక్ కట్ చేసి పుట్టినరోజు వేడుకలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు డాక్టర్ కడియం కావ్య గారికి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం హనుమకొండ లోని పరకాల శాసనసభ్యుడు, వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గ ఇంచార్జి రేవూరి ప్రకాశ్ రెడ్డి



నివాసంలో ఏర్పాటు చేసిన పరకాల టౌన్ బూత్ కమిటీ, సమన్వయ కమిటీ సమావేశంలో వరంగల్ పార్లమెంట్ అభ్యర్థి డాక్టర్ కడియం కావ్య పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే మొలుగూరి భిక్షపతి, పరకాల నియోజకవర్గ కోఆర్డినేటర్ అశోక్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ రామకృష్ణ బూత్ కమీటీ సభ్యులు కార్యకర్తలు పాల్గొన్నారు. కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి కడియం కావ్య జన్మదినం సందర్భంగా ఆమెను టీపీసీసీ, వరంగల్ జిల్లా సోషల్ మీడియా కో ఆర్డినేటర్ సోమ లక్ష్మి కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

# పీఏ సతీష్‌ను పరామర్శించిన మంత్రి సీతక్క



**వరంగల్ వాయిస్, మణుగూరు :** పట్టణానికి చెందిన రాష్ట్ర మంత్రి డాక్టర్ సీతక్క వ్యక్తిగత సహాయకుడు బండారి సతీష్ తండ్రి బండారి వెంకటేశ్వర్లు ఇటీవల మరణించగా వారి కుటుంబాన్ని బుధవారం రాష్ట్ర పంచాయితీ రాజ్ శాఖ మంత్రి సీతక్క, మహబూబాబాద్ పార్లమెంట్ అభ్యర్థి పోరిక బలరాం నాయక్ పరామర్శించి ఆయన చిత్ర పటం వద్ద నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు పైడాకుల అశోక్, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర, జిల్లా, బ్లాక్, మండల గ్రామ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# డ్రంకెన్ డ్రైవ్‌లో ఒకరికి జైలు

**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** వరంగల్ పోలీస్ స్టేషన్ పరిధిలో నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్‌లో ఒకరికి మూడు రోజుల జైలు శిక్ష విధించారని ట్రాఫిక్ సీఐ శ్రీధర్ తెలిపారు. వరంగల్ ఎస్సార్ నగర్‌కు చెందిన సురేందర్ అనే వ్యక్తి వెంకట్రామ జంక్షన్ వద్ద మద్యం సేవించి ఉండగా అదుపులో తీసుకున్నామని చెప్పారు. ఇతడిపై బుధవారం కోర్టులో చార్జిషీట్ ఫైల్ చేయగా, వరంగల్ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ గుర్రపు వీరస్వామి అతనికి మూడు రోజుల జైలుశిక్ష విధించారని పేర్కొన్నారు.అతడిని మహబూబాబాద్ సబ్ జైలుకు పంపినట్లు వరంగల్ ట్రాఫిక్ సీఐ శ్రీధర్ తెలిపారు.

# గురుద్వార్‌లో దాస్యం వినయ్ భాస్కర్ ప్రత్యేక పూజలు



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** తెలుగు నూతన సంవత్సరం సందర్భంగా అలంకార్‌లో ని గురుద్వార్‌లో మాజీ చీఫ్ విప్, బీఆర్ఎస్ పార్టీ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్ భాస్కర్ ప్రత్యేక పూజలు చేశారు. ఆయన బుధవారం మధ్యాహ్నం అలంకార్‌లో పర్యటించారు. ఈ సందర్భంగా నూతన సంవత్సరంలో అన్ని కులాలు, మతాల వారికి, సమస్త మానవాళికి శుభం కలగాలని గురుద్వార్‌లో ప్రార్థన చేశారు. తెలంగాణ, భారత దేశం అన్ని మతాలకు నెలవని తెలిపారు. ప్రత్యేక ప్రార్థనల్లో రాష్ట్ర మైనార్టీ కమిషన్ మెంబర్ దర్శన్ సింగ్, పశ్చిమ నియోజకవర్గ కో ఆర్డినేటర్ పులి రజినీకాంత్, డివిజన్ అధ్యక్షులు సదాంత్, ఖలీల్, బీఆర్ఎస్ నాయకులు మాలకుమ్మరి పరుశురాములు, జగన్, అజిత్, గురుద్వార్ ప్రబంధ కమిటీ సభ్యులు హరిసింగ్, దీప్తి సింగ్, ఆజాద్ సింగ్, జిత్తు తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థుల సృజనాత్మకతకు ప్రేరణ పోటీలు

## జిల్లా స్థాయి ప్రేరణ ఉత్సవ్ పోటీల నిర్వహణ



**వరంగల్ వాయిస్, వరంగల్ :** జనగామ, వరంగల్ జిల్లాల స్థాయి ప్రేరణ ఉత్సవ్ పోటీలు బుధవారం జవహర్ నవోదయ విద్యాలయ వరంగల్ లో నిర్వహించారు. ప్రారంభ సమావేశంలో పర్యవేక్షకుడిగా వ్యవహరించిన జిల్లా విద్యాశాఖ అకడమిక్ మానిటరింగ్ అధికారి బొమ్మనబోయిన శ్రీనివాస్ మాట్లాడుతూ విద్యార్థుల్లోని అంతర్గత సృజనాత్మకతకు ప్రేరణ కల్పించడమే ఈ కార్యక్రమ ప్రధాన ఉద్దేశ్యమని తెలిపారు. అలాగే కార్యక్రమ సమన్వయకర్తగా వ్యవహరించిన వరంగల్ విద్యాశాఖ అకడమిక్ మానిటరింగ్ అధికారి మాలోతు సారయ్య మాట్లాడుతూ విద్యార్థుల్లో విభిన్న బారతీయ సాంస్కృతిక వికాస అభివృద్ధికి ఈ కార్యక్రమం తోడ్పడుతుందన్నారు. కార్యక్రమ నోడల్ అధికారిగా జేఎన్ వీ పాఠశాల ఇంచార్జి ప్రిన్సిపాల్ హీరాలాల్ వ్యవహరించారు. రెండు జిల్లాల్లోని 'పాఠశాలల స్థాయి ప్రేరణ ఉత్సవ్' లో మొదటి స్థానంలో నిలిచిన ఒక బాలిక, ఒక బాలుడు ఈ పోటీలలో పాల్గొన్నారు. జనగాం జిల్లాకు చెందిన 88 పాఠశాలల నుంచి మొత్తం 172 విద్యార్థులు, వరంగల్ జిల్లాకు చెందిన 122 పాఠశాలల నుంచి 243 మంది విద్యార్థులు వివిధ విభాగాలలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో వ్యాస రచన, డ్రాయింగ్, పాటలు, పద్యాల రచన, కార్టూన్స్ గీయడం విభాగాలలో పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో ప్రతి జిల్లా నుంచి ఉత్తమ ప్రదర్శన ఇచ్చిన 15 మంది బాలికలను,15 మంది బాలురను మొదట ఎంపిక చేశారు. వారిని వికసిత భారత్, దేశం పట్ల నా వైఖరి అనే అంశాలపై రెండు ప్యానళ్ల న్యాయ నిర్ణేతలు ముఖాముఖి నిర్వహించి ప్రతి జిల్లా నుంచి ఒక బాలికను, బాలుడిని ఎంపిక చేస్తారు. వీరికి మన ప్రధాని నరేంద్ర మోడి ప్రాథమిక విద్య అభ్యసించిన గుజరాత్ లోని వాద్ నగర్ లో వారం రోజుల పాటు రెసిడెన్షియల్ పద్ధతిలో శిక్షణ అందిస్తారు. ఆ శిక్షణలో బారతీయ సంస్కృతి, చారిత్రక వారసత్వం, వికసిత భారత్ ఏ2047,బారతీయ కళలు,బారతీయ శాస్త్రవేత్తలు, భారత స్వాతంత్ర్య సమరయోధులు, సంఘ సేవకులు, భారత సాంకేతిక అభివృద్ధి గూర్చి విస్తృతంగా అవగాహన కల్పిస్తారు. అలాగే వీరికి గుజరాత్ లోని చారిత్రక ప్రదేశాల సందర్శనకు క్షేత్ర పర్యటన ఏర్పాటు కూడా చేస్తారు. వివిధ రాష్ట్రాల్లోని 10 జిల్లాల్లో జిల్లా స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచిన విద్యార్థులను ఒక బ్యాచ్ గా చేసి ఈ ప్రేరణ కార్యక్రమం శిక్షణ అందిస్తారు. ఈ కార్యక్రమంలో పాఠశాల వైస్ ప్రిన్సిపాల్ రమేష్, పాఠశాల ఉపాధ్యాయులు సుధీర్, రామలింగయ్య, అనురాధ, న్యాయనిర్ణేతల ప్యానల్ లో అనిత, వెంకటేశ్వర్లు, భవాని, కృష్ణవేణి, చక్రవర్తుల శ్రీనివాస్, అశోక్, మాధవి, ప్రభ సభ్యులుగా వ్యవహరించారు.

# నూతన ప్రెస్ క్లబ్ కమిటీ ఎన్నిక

### అధ్యక్షుడిగా కాళేశ్వరం నర్సయ్య

### ప్రధాన కార్యదర్శిగా రంగు శ్రీధర్





**వరంగల్ వాయిస్, శాయంపేట :** మండల వర్కింగ్ జర్నలిస్టులు నూతన ప్రెస్ క్లబ్ కమిటీనీ టీయూడబ్ల్యూజే (ఐజేయూ) జిల్లా ఉపాధ్యక్షుడు గన్ను సంతోష్ కుమార్ ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ప్రెస్ క్లబ్ కమిటీ అధ్యక్షుడిగా కాళేశ్వరం నర్సయ్య, ప్రధాన కార్యదర్శి రంగు శ్రీధర్, గౌరవ అధ్యక్షుడిగా చల్లా రాజిరెడ్డి, ముఖ్య సలహదారులుగా సీనియర్ జర్నలిస్టులు దుంపల మహేందర్ రెడ్డి, బాసాని నాగభూషణం, ఉపాధ్యక్షుడిగా కొమ్ముల సతీష్ కుమార్ లను ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాట్లాడుతూ మండల జర్నలిస్టుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తామన్నారు. తమపై నమ్మకంతో ఏకగ్రీవంగా ఎన్నుకున్న జర్నలిస్టులకు ధన్యవాదాలు తెలిపారు. నిజం తప్పిన వ్యవస్థ పై మడమ తిప్పకుండా ప్రజలకు, ప్రభుత్వ పాలకులకు వారధిగా అందర్నీ కలుపుకుని ముందుకు తీసుకు పోతామని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల జర్నలిస్టులు బలిజే వేణు, కొత్తపల్లి నవీన్,మాలోతు దేవ్ సింగ్, తుడుం క్రాంతి కుమార్,కొడిమాల రాజేందర్, అంకేశ్వరపు వంశీ, చెన్నబోయిన బుచ్చిబాబు, బంక ప్రవీణ్, బాసాని మల్లికార్జున్, జక్కుల కృష్ణమూర్తి, సురేష్, గిరబోయిన రాజు, తుడుం రవీందర్, తుడుం రాజు పాల్గొన్నారు.

# ప్రతి నెల 1న వేతనాలు చెల్లించాలి

## రామ రాజేష్ ఖన్నా డిమాండ్



**వరంగల్ వాయిస్, వరంగల్ :** నేషనల్ హెల్త్ మిషన్ లో పనిచేస్తున్న సుమారు 17 వేల మంది ఉద్యోగులందరికీ ఫిబ్రవరి 2024 నెల వేతనం ప్రభుత్వం అకౌంట్లలో 08-04-2024 క్రెడిట్ చేయడం జరిగిందని న్ హెచ్ ఎం ఆల్ క్యాడర్స్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామ రాజేష్ ఖన్నా తెలిపారు. 7 నెలలు పీఆర్సీ ఏరియర్స్ వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని కోరడం జరుగుతుంది. మహిళా ఉద్యోగులకు 180 రోజుల వేతనంతో కూడిన ప్రసూతి సెలవులు అమలు చేయాలని, ఎన్ హెచ్ ఎం ఉద్యోగులందరికీ ప్రతి నెల 1న వేతనాలు ఇచ్చే విధంగా ప్రభుత్వం ఆలోచన చేయాలని, మార్చి 2024 వేతనం పెండింగ్ లో ఉంది. మార్చి వేతనం కూడా త్వరలో ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. 510 జీవోలో నష్టపోయిన 4000 కుటుంబాలకు న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని వేడుకుంటున్నామని అన్నారు. ఎన్ హెచ్ఎం ఉద్యోగులందరికీ రెగ్యులర్ ఉద్యోగుల బేసిక్ వేతనం అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఎన్ హెచ్ ఎం కాంట్రాక్ట్ అండ్ ఔట్ సోర్సింగ్ ఉద్యోగులందరికీ కూడా ప్రక్షాళన చేసి రెగ్యులరైజ్ చేయాలని నేషనల్ హెల్త్ మిషన్ కాంట్రాక్ట్ అండ్ ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల సంఘం ఏఐటీయూసీ నాయకుడు, ఎన్ హెచ్ఎం ఆల్ క్యాడర్స్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామ రాజేష్ ఖన్నా డిమాండ్ చేశారు.

# మత సామరస్యానికి ప్రతీక ఇఫ్తార్



**వరంగల్ వాయిస్, చెన్నారావుపేట :** మండలంలోని పాతముగ్ధుంపురం గ్రామంలో ఉన్న మసీదులో కాంగ్రెస్ నాయకులు ముస్లిం సోదరులకు రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకొని ఇఫ్తార్ విందును ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ముస్లిం సోదరులతో కలిసి ఉపవాసం ఉన్న ముస్లిం సోదరులకు పండ్లు, ఫలాలను అందించి ఉపవాస దీక్షలను విరమింప చేయించారు. మతసామరస్యానికి ప్రతీక ఇఫ్తార్ అని కొనియాడారు. అనంతరం ముస్లిం సోదరులకు రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మసీదు ఇమామ్ మహమ్మద్ ఎజాస్, కాంగ్రెస్ నాయకులు ననుమాస వీరస్వామి, పోలెపల్లి బిక్షపతి, మాజీ గ్రామ ఉపసర్పంచ్ ననుమాస కరుణాకర్, శంకేసి రంజిత్ కుమార్, పటాన్, పఠాన్ బొత్త, షేక్ పాషా, సాహెబ్, గోరెమియా, పటాన్ హుస్సేన్, షేక్ యాకూబ్, హుస్సేన్, పెద్ద కరీం పాల్గొన్నారు.

## బాధిత కుటుంబానికి చేయూత



**వరంగల్ వాయిస్, వరంగల్ :** తూర్పు శాసనసభ్యురాలు అటవీ పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ మోరళీధర్ రావు ఆదేశాల మేరకు 13వ డివిజన్ కాంగ్రెస్ కాంటస్టెడ్ కార్పొరేటర్ రోకుల వరుణ్ స్థానికుడు కీ.శే. కటారి రమేష్ అలియాస్ రాము జ్ఞాపకార్థ రోజు సందర్భంగా వారి కుటుంబాన్ని పరామర్శించారు. ఈ సందర్భంగా 100 కిలోల బియ్యం ఆ కుటుంబానికి అందజేశారు. వీరితో 13వ డివిజన్ కాంగ్రెస్ నాయకులు జన్న అనిల్ కుమార్, పోగుల రాము, కోట భిక్షపతి, ములుగూరి సంజీవ, చిన్నగారి నాగరాజు, జద్సన్, అమెర్, ఆయన్ష్, కోటవేణు, ఫరీద్ పాల్గొన్నారు.

## రాజ్యలక్ష్మి మృతిపై వెంకట్రాములు దిగ్భ్రాంతి



**వరంగల్ వాయిస్, వరంగల్ :** వరంగల్ కొత్తవాడలో షతరంజి చేనేత సహకార సంఘం అధ్యక్షుడు కొలిపాక మదనయ్య సతీమణి, చేనేత ముద్దుబిడ్డ రాజ్యలక్ష్మి అనారోగ్యంతో మృతి చెందడం దిగ్భ్రాంతిని కలిగించిందని తెలంగాణ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షులు తాటిపాముల వెంకట్రాములు అన్నారు. బుధవారం రాజ్యలక్ష్మి భౌతికకాయంపై పుష్ప గుచ్చాలుంచి శ్రద్ధాంజలి ఘటించి ఆయన జోహార్లు అర్పించారు. ఆమె మరణం పట్ల ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తం చేసి వారి కుటుంబ సభ్యులకు సానుభూతిని తెలియజేశారు. ఆమెకు ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. పలువురు చేనేత సంఘాల నాయకులు, పద్మశాలి సంఘం నాయకులు, బంధు మిత్రులు, చేనేత కార్మికులు పెద్ద సంఖ్యలో రాజ్యలక్ష్మి భౌతికకాయాన్ని సందర్శించి నివాళులు అర్పించి అనంతరం జరిగిన అంతిమయాత్రలో పాల్గొని కన్నీటి వీడ్కోలు పలికారు.

## మంత్రి సీతక్క పీఏ కుటుంబానికి పరామర్శ



**వరంగల్ వాయిస్, ములుగు :** మంత్రి సీతక్క వ్యక్తిగత సహాయకుడు (పీఏ) బండారి సతీష్ తండ్రి వెంకటేశ్వర్లు ఇటీవల అనారోగ్యంతో మరణించారు. కాగా, బుధవారం కాంగ్రెస్ ములుగు జిల్లా సీనియర్ నాయకుడు బాదం ప్రవీణ్ మణుగూరుకి వెళ్లి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మృతుడి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించడంతో పాటు కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. బాదం ప్రవీణ్ వెంట ములుగు జిల్లా యూత్ కాంగ్రెస్ సెక్రటరీ నేపాల్ రావు, ములుగు మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు కుక్కల నాగరాజు, ములుగు మండల యూత్ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ బండి మధు, కాంగ్రెస్ పార్టీ కుటుంబ సభ్యులు ఉన్నారు.

## రంజాన్ పండుగకు ఏర్పాట్ల పరిశీలన



**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** నగరంలోని మట్టేవాడ పోలీస్ స్టేషన్ పరిధిలోని జెమినీ థియేటర్ ఎదురుగా ఉన్న ఈద్గాను బుధవారం వరంగల్ సబ్ డివిజన్ ఏసీపీ నంది రాంనాయక్, ట్రాఫిక్ ఏసీపీ సత్యనారాయణ రంజాన్ పండుగ సందర్భంగా ట్రాఫిక్ ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్ల కోసం ఈద్గా వద్ద ముస్లిం మత పెద్దలతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మట్టేవాడ సీఐ తుమ్మ గోపి, ట్రాఫిక్ సీఐ శ్రీధర్, ఎస్సైలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



## ఓటిటిలోకి వచ్చేస్తున్న
# గోపీచంద్ భీమా

టాలీవుడ్ మాచో స్టార్ గోపీచంద్ ప్రధాన పాత్రలో వచ్చిన తాజా చిత్రం 'భీమా'. యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా వచ్చిన ఈ సినిమాకు కన్నడ దర్శకుడు ఏ హర్ష దర్శకత్వం వహించగా.. ప్రియా భవానీ శంకర్, మాళవిక శర్మ హీరోయిన్లుగా నటించారు. ఈ చిత్రం మహా శివరాత్రి కానుకగా మార్చి 8న ప్రేక్షకుల ముందుకు వచ్చి బాక్సాఫీస్ వద్ద యావరేజ్‌గా నిలిచింది. అయితే ఈ సినిమా తాజాగా ఓటీటీ లాక్ చేసుకుంది. ప్రముఖ ఓటీటీ వేదిక డిస్నీ ప్లస్ హాట్‌స్టార్‌లో ఏప్రిల్ 25 నుంచి ఈ సినిమా తెలుగుతో పాటు తమిళం, మలయాళం, హిందీ, కన్నడ భాషల్లో స్ట్రీమింగ్ కానున్నట్లు మేకర్స్ ప్రకటించారు. శ్రీసత్యసాయి ఆర్ట్స్ బ్యానర్‌పై కేకే రాధామోహన్ ఈ సినిమాను నిర్మించగా.. 'సలార్' ఫేమ్ రవి బస్రూర్ సంగీతం అందించాడు. ప్రియాంక భవానీ శంకర్, మాళవిక శర్మ హీరోయిన్లుగా అలరించిన ఇందులో వెన్నెల కిషోర్, రఘుబాబు, నాజర్, నరేష్ కీలకపాత్రల్లో నటించారు.





# హీరామండి
## ట్రైలర్ విడుదల

బాలీవుడ్ దర్శకుడు సంజయ్ లీలా భన్సాలీ దర్శకత్వంలో వస్తున్న తాజా వెబ్ సిరీస్ హీరామండి: ది డైమండ్ బజార్. ఈ సిరీస్‌తోనే డిజిటల్ ప్లాట్ ఫామ్‌లోకి అడుగు పెడుతున్నారు భన్సాలీ. పీరియాడిక్ డ్రామా నేపథ్యంలో వస్తున్న ఈ చిత్రంలో బాలీవుడ్ స్టార్ హీరోయిన్స్ మనీషా కొయిరాలా, సోనాక్షి సిన్హా, అదితి రావ్ హైదరీ, రిచా చద్దా, షర్మిన్ సెగల్, సంజీదా షేక్‌లు ప్రధాన పాత్రలు పోషిస్తున్నారు. ప్రముఖ ఓటీటీ నెట్‌ఫ్లిక్స్‌లో ఈ వెబ్ సిరీస్ మే 01 నుంచి అందుబాటులోకి రానుంది. ఇక విడుదల తేదీ దగ్గరపడటంతో సిరీస్ నుంచి మేకర్స్ ట్రైలర్ విడుదల చేశారు. ట్రైలర్ గమనిస్తే.. ఇండిపెండెన్స్‌కు ముందు పాకిస్తాన్ లాహోర్‌లోని హీరామండి అనే ప్రాంతంలో వేశ్యలు ఉండగా.. ఈ ప్రాంతాన్ని మల్లికాజాన్ (మనీషా కొయిరాలా) పరిపాలిస్తుంటుంది. అయితే ఈ ప్రాంతాన్ని తమ గుప్పట్లోకి తెచ్చుకోవాలని బ్రిటీష్ వాళ్ల ప్రయత్నిస్తుంటారు. ఈ క్రమంలోనే మల్లికాజాన్ (మనీషా కొయిరాలా) ఏం చేసింది. అన్నింటిని ఎదుర్కొని హీరామండిలో చివరకు ఎవరు రాజ్యమేలుతారు? అనే స్టోరీతో ఈ వెబ్ సిరీస్ వస్తుంది. ఈ చిత్రానికి భన్సాలీతో పాటు విభు పూరి, మితాక్షర కుమార్ సంయుక్తంగా దర్శకత్వం వహిస్తున్నారు.



## స్పీడ్ పెంచిన
# శర్వానంద్

రెండేండ్లుగా సైలెంట్ గా ఉన్న యువ హీరో శర్వానంద్ సినిమాల వేగం పెంచారు. ఏకంగా నాలుగైదుచిత్రాలు లైన్‌లో పెట్టాడు. తాజాగా అదే కోవలో మరో కొత్త చిత్రాన్నికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు సమాచారం. చివరగా 2022లో ఒకే ఒక జీవితం సినిమాలో కనిపించిన ఆయన ఇప్పటివరకు మరే సినిమాలోనూ కనిపించలేదు. ఈ చిత్రం తర్వాత పెళ్లి చేసుకుని ఓ ఇంటివాడైన శర్వా తాజాగా తండ్రిగా ప్రమోషన్ కూడా పొందిన సంగతి తెలిసిందే. ఇప్పటికే మనమే  అనే చిత్రం షూటింగ్ లో శర్వా బిజీగా ఉండగా.. ఈ చిత్రం నుంచి ఇటీవల విడుదల చేసిన పాట మంచి వ్యూస్ దక్కించుకుంది. తాజాగా తన జన్మదినం సందర్భంగా , 37 మరో రెండు చిత్రాలను ప్రకటించారు. ఇప్పుడు అదే కోవలో మరో కొత్త చిత్రాన్నికి గ్రాన్ సిగ్నల్ ఇచ్చినట్లు సమాచారం. గతంలో రానాతో ఘాజీ , వరుణ్ తేజ్‌తో అంతరిక్షం , విద్యుత్ జమ్వాల్  అనే బాలీవుడ్ చిత్రం రూపొందించిన యువ దర్శకుడు సంకల్ప్ రెడ్డి  తాజాగా చాలా గ్యాప్ తర్వాత మరో సినిమా రూపొందించడానికి సిద్ధమైనట్లు తెలుస్తోంది.సంకల్ప్ చెప్పిన కథ నచ్చడంతో శర్వానంద్ ఓకే చెప్పాడని ..ఈ చిత్రం పాన్ ఇండియా రేంజ్‌లో తెరకెకక్కున్నట్లు, ఈ యేడాది చివరలో సెట్స్ పైకి రానునన్నట్లు సోషల్ మీడియాలో వార్తలు హల్‌చల్ చేస్తున్నాయి.



## పెళ్లి గురించి ప్రచారం అక్కర్లేదనుకున్నాం: తాప్సీ

నటి తాప్సీఇటీవలే వివాహబంధంలోకి అడుగుపెట్టిన సంగతి తెలిసిందే. ఈ విషయాన్ని సీక్రెట్‌గా ఉంచడంపై ఆమె తాజాగా ఓ ఇంటర్వ్యూలో మాట్లాడారు. అది పూర్తిగా వ్యక్తిగత వ్యవహారమన్నారు.

'నా వివాహానికి సంబంధించిన విషయాలను వెల్లడించి అందరిలో ఆసక్తి పెంచాలని అనుకోవడం లేదు. దాని గురించి అందరూ చర్చించుకోవడం నాకు ఇష్టం లేదు. అందుకే బయటకు చెప్పలేదు. ఇది నా అభిప్రాయం మాత్రమే. ఈ విషయంలో నా భర్తకు మరో అభిప్రాయం ఉండొచ్చు. అందుకే మేము దీని గురించి మీడియా, సోషల్ మీడియాలో చెప్పలేదు. పెళ్లి చేసుకున్న సంగతిని ఎప్పటికీ రహస్యంగా ఉంచాలనే ఉద్దేశం మాకు లేదు. నా సన్నిహితులు, కుటుంబసభ్యులు మొదటి నుంచి దీనిలో భాగమయ్యారు. వాళ్లకు అన్నీ తెలుసు. వాళ్ల అంగీకారంతోనే చేసుకున్నాం. పెళ్లి అనేది జీవితంలో ఒకేసారి జరుగుతుంది. దాన్ని ఆనందంగా చేసుకోవాలని నిర్ణయించుకున్నా. ఆర్భాటాలకు చోటివ్వకుండా కొందరి సమక్షంలో ఒక్కటయ్యాం. నా పెళ్లి ఫొటోలు, వీడియోలను కూడా పంచుకోవడానికి ప్రస్తుతం సిద్ధంగా లేను. భవిష్యత్తులో అందరికీ షేర్ చేయాలనుకుంటే అప్పుడు పోస్ట్ చేస్తాను' అని చెప్పారు. మార్చి 23న ఉదయ్‌పుర్‌లో తాప్సీ-మథియాస్ బో వివాహం జరిగింది. ఇటీవల వీరి పెళ్లి వీడియో లీకవ్వగా అది వైరల్‌గా మారింది

పాఠకులకు, ప్రకటనకర్తలకు,
శ్రీ క్రోధి నామ సంవత్సర ఉగాది పర్వదిన శుభాకాంక్షలు

# ఓటరు చైతన్యంపై.. 16న 5కె రన్

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** ఓటరు చైతన్యంపై ఈనెల 16న నిర్వహించే 5కె రన్ లో విద్యార్థులు, యువత, అధికారులు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ పిలుపునిచ్చారు. హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లో 5కె రన్ కు సంబంధించిన పోస్టర్లను గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే, అడిషనల్ కలెక్టర్లు రాధిక గుప్తా, వెంకట్ రెడ్డి, జిల్లా యువజన, క్రీడల అధికారి అశోక్ కుమార్, ఇతర అధికారులతో కలిసి కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో ఓటు హక్కు కలిగిన ప్రతి ఓటరూ ఓటు వేసేవిధంగా చైతన్యం తీసుకువచ్చేందుకే 5కె రన్ ను 16వ తేదీన ఉదయం 6 గంటలకు హనుమకొండ జేఎన్ స్టేడియం నుంచి హనుమకొండ జిల్లా కలెక్టరేట్ వరకూ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. హనుమకొండ, వరంగల్ జిల్లాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 5కె రన్ ను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



# 12న నగరానికి రానున్న విజయా నంద తీర్ధ స్వామీ

**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** దత్త పీఠం ఉత్తరాధికారి, పరమ హంస పరివ్రాజాక చార్య శ్రీ దత్త విజయానంద తీర్థ స్వామీ ఈ నెల 12న నగరానికి వస్తున్నట్లు ములుగు రోడ్ లోని శ్రీగణపతి సచ్చిదానంద దత్త జ్ఞాన బోధ సభ ట్రస్ట్ సభ్యులు వైవీ.వామన్ రావు తెలిపారు. శ్రీ క్రోధ నామ సంవత్సరంలో భక్తులకు శుభాలు కలగాలని కోరుతూ స్వామి చేతులమీదుగా సాయంత్రం 5 గంటలకు నవగ్రహ హెూమం, రాత్రి 7 గంటలకు పూర్ణహుతి నిర్వహించనున్నట్లు తెలిపారు. అనంతరం ప్రసాద వితరణ జరుగుతుందన్నారు. అలాగే 13న పరకాల సమీపంలోని చిన్న కోడెపాక గ్రామంలో దత్త భక్తులచే నిర్మించిన ఆలయాల్లో కుంభభిషేకం, విగ్రహ ప్రతిష్టాపణ పూజలు, హెూమాలు నిర్వహించనున్నారు. అదే రోజు సాయంత్రం హైదరాబాద్ కు వెళ్లనున్నట్లు వామన్ రావు తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు డాక్టర్ కంటెం లక్ష్మీ నారాయణ, ప్రొఫెసర్ శివరామ కృష్ణ ప్రసాద్, బెండల అర్జున్ రావు, చకిలం ఏకంబ్రం, అడ్డగూడి వెంకటేశ్వర్లు, వద్దిరాజు శర్వాణి, తోట శివకుమార్, విజేందర్ రెడ్డి, యుగంధర్, జూలూరు శ్రీనివాస్, ఓం ప్రకాష్, వద్దే రవీందర్, మెడిశెట్టి కుమారస్వామి, కొక్కుల రాజేంద్ర ప్రసాద్, వడిచర్ల శ్రీనివాస్ పాల్గొన్నారు.

# ఎస్‌హెచ్‌ఆర్‌సీలో ఎస్సైపై కేసు

**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** అకారణంగా ఒక పత్రిక విలేఖరి, అతని సోదరుడిపై దాడి చేసి చేతులు విరగ్గొట్టిన నర్సింహులపేట ఎస్సై గండ్రాతి సతీష్ పై తెలంగాణ మానవ హక్కుల కమిషన్ ఎట్టకేలకు కేసు నమోదు చేసింది. నర్సింహులపేట మండలం నర్సింహపురం (బంజార) గ్రామానికి చెందిన మేకరబోయిన నాగేశ్వర్ అయన తమ్ముడు బ్రమ్మేష్ గత నెల 27 నా ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదైంది. అలాగే జర్నలిస్ట్ నాగేశ్వర్ చేతులు విరగొట్టినందున మరో కేసును తెలంగాణ మానవ హక్కుల కమిషన్ నమోదు చేసినట్లు పేర్కొంది. గత నెల 15 తేది రాత్రి ఎస్సై దాడి చేసి గాయపరిచి వారి మీదే అక్రమ కేసు పెట్టాడని బాధితులు మేకరబోయిన నాగేశ్వర్, మేకరబోయిన బ్రమ్మేశ్ లు హక్కుల సంఘానికి ఫిర్యాదు చేశారు. ప్రాథమిక విషయాలు పరిశీంచి మహబూబాబాద్ జిల్లా నర్సింహులపేట ఎస్సై గండ్రాతి సతీష్ పై కేసు మానవ హక్కుల ఉల్లంఘన కింద కేసు నమోదు చేసినట్లు తమకు సమాచారం వచ్చినట్లు బాధితులు తెలిపారు. రాష్ట్ర డీజీపీ, జిల్లా ఎస్పీకి ఈ మేరకు సమాచారం ఇచ్చారు.

ఉగాది పర్వదిన శుభాకాంక్షలు
అమృత మల్టీస్పెషాలిటి హాస్పిటల్ వారు అందిస్తున్న
"అమృత హస్తం - డిస్కౌంట్ కార్డు"
కేవలం రూ॥ 590/-లు చెల్లించి నలుగురు (4) కుటుంబ సభ్యులకు 3 సంవత్సరాల వరకు మా హాస్పటల్‌లో చూపించుకొన్నచో ఈ క్రింది విధంగా డిస్కౌంట్ పొందగలరు.
OP Fee - 20%
Medcial Shop - 15%
Lab, X-Ray, CT Scan
MRI, USG Scan - 30%
జనరల్ అడ్మిషన్స్ మరియు అన్నిరకాల ఆపరేషన్స్‌లు - 30%
24/7 డ్యూటీ డాక్టర్స్ పర్యవేక్షణలో నడుపబడును. ఈ కార్డు పొందిన కుటుంబ సభ్యుల పిల్లలు డెలివరి అయినచో ఆడపిల్ల పుట్టినచో రూ॥ 3,116/-లు మరియు మగ పిల్లవాడు పుట్టినచో రూ॥ 2,116/- పారితోషికంగా ఇవ్వబడును.
ప్రస్తుతం మన హాస్పిటల్‌లో గల ఆర్థోపెడిక్, జనరల్ ఫిజిషియన్, జనరల్ సర్జన్, గైనకాలజి, ఇ.ఎన్.టి. పల్మనాలజి, పిల్లల, రేడియేషన్ డాక్టర్స్ కలరు.
మా వద్ద: LAB, ECG, Pharmacy ఆపరేషన్ థియేటర్ మరియు అడ్మిషన్ సౌకర్యం కలదు
అమృత మల్టీస్పెషాలిటి హాస్పిటల్
2వ బస్ డిపో ఎదురుగా, విజయ టాకీస్ ప్రక్కన, కాకాజీ కాలనీ, హనుమకొండ
7794811193, 9393951289









# ఈద్గాలను సందర్శించిన సీపీ

**వరంగల్ వాయిస్, క్రైం :** రంజాన్ పర్వదిన వేళ ముస్లింలు ప్రార్థనలు నిర్వహించుకునే ప్రాంతాలైన మాట్టేవాడ, హనుమకొండ బొక్కల గడ్డ ఈద్గాలను వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝూ స్థానిక పోలీస్ అధికారులతో కలిసి బుధవారం రాత్రి సందర్శించారు. ఈ సందర్భంగా ప్రార్థన సమయంలో పోలీస్ బందోబస్తూ ఏర్పాట్లపై అధికారులతో ఆయన సమీక్షించారు. ప్రశాంతమైన వాతావరణంలో ముస్లింలు ప్రార్థనలు జరుపుకునే విధంగా తగు పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయాల్సిందిగా పోలీస్ కమిషనర్ అధికారులకు ఆదేశించారు. పోలీస్ కమిషనర్ వెంట స్పెషల్ బ్రాంచ్, హనుమకొండ, వరంగల్, ట్రాఫిక్ ఏసీపీలు జితేందర్ రెడ్డి, దేవేందర్ రెడ్డి, నందిరాం నాయక్, ఇన్స్ స్పెక్టర్లు శ్రీనివాస్, గోపి, సతీష్, శ్రీధర్ తో పాటు ఎస్సైలు పాల్గొన్నారు.
















# భద్రకాళికి లక్ష మల్లికాపుష్పార్చన

## వేలాదిగా హాజరైన భక్తులు

వరంగల్ మహా నగరంలో పరమపావనమైన పుణ్యక్షేత్రంగా విరాజిల్లుతున్న శ్రీ భద్రకాళి దేవస్థానంలో వసంత నవరాత్ర మహోత్సవం బుధవారం రెండో రోజుకు చేరుకున్నాయి. భద్రకాళి దేవస్థాని కార్యనిర్వహణాధికారి కె.శేషుభారతి ఆధ్వర్యంలో ఉదయం సుప్రభాత సేవ, నిత్యాహ్నికం నిర్వహించారు. అనంతరం నిత్యాహ్నికం, జపహోమార్చనాభిషేకాలు నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష మల్లె పూలతో నిర్వహించిన అర్చన భక్తులను ఆకట్టుకుంది. తెలుపు సత్యగుణానికి ప్రతీక. అందుకే తెలుపు వర్ణానికి చెందిన మల్లె పూలతో అమ్మవారిని అర్చించడం జరిగిందని ఆలయ ప్రధానార్చకులు శ్రీ భద్రకాళి శేషు తెలిపారు. ప్రజలు శాంతి సౌభాగ్యాలతో జీవించడానికి ఈ వైష్ణవీ శక్తి ఆరాధన ఉపకరిస్తుందన్నారు.

***పద్మాక్షి దేవి ఆలయంలో..***

హనుమకొండలోని శ్రీ హనుమద్గిరి పద్మాక్షి దేవి ఆలయంలో బుధవారం పుష్పయాగంలో భాగంగా రెండో రోజు పీతవర్ణ పత్రాలు ధవణం, సంపెంగలతో అమ్మవారిని అలంకరించారు. వారాన్ని బట్టి ఆ యొక్క గ్రహ సంబంధంగా వర్ణ పుష్పాలతో అర్చించడంద్వారా విశేషమైన ఫలితం లభిస్తుందని ప్రధాన అర్చకులు వెల్లడించారు.

– వరంగల్ వాయిస్, వరంగల్



# రంజాన్ శుభాకాంక్షలు తెలిపిన మంత్రి సురేఖ



**వరంగల్ వాయిస్, వరంగల్ :** రంజాన్ పండుగ (ఈద్–ఉల్–ఫితర్) ను పురస్కరించుకొని అటవీ, పర్యావరణ, దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపారు. రంజాన్ మాసం సందర్భంగా చేపట్టే ఉపవాస దీక్షలు, ఖురాన్ పఠనం, పేదవారికి దానం వంటి కార్యక్రమాలు స్వీయ క్రమశిక్షణను, జీవితం పట్ల సానుకూల దృక్పథాన్ని కలిగిస్తాయన్నారు. మనుషుల్లో సహనం, కరుణ, త్యాగం, పరోపకారం వంటి మానవీయ విలువలను రంజాన్ పండుగ పెంపొందిస్తుందని మంత్రి తెలిపారు. ముస్లింల సంక్షేమానికి, వారి వికాసానికి కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. తెలంగాణ గంగా జమునా తెహజీబ్ ను కాపాడుకోవటంలో ప్రజలంతా కుల, మతాలకు అతీతంగా ఏకమై విద్వేష రాజకీయాలకు బుద్ధి చెప్పాలని ఈ సందర్భంగా ప్రజలకు పిలుపునిచ్చారు. అల్లా దయతో తెలంగాణ రాష్ట్రం సుభిక్షంగా వర్ధిల్లాలని మంత్రి కొండా సురేఖ ఆకాంక్షించారు.


# మత్తు పదార్థాలతో యువత చిత్తు

## దాని నుంచి కాపాడుకుందాం
## వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా



**వరంగల్ వాయిస్, క్రైం :** నేటి యువతను మత్తు పదార్థాలకు బానిస కాకుండా కాపాడుకుందామని వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా అధికారులకు పిలుపునిచ్చారు. తెలంగాణ రాష్ట్ర యాంటీ నార్కోటిక్స్ బ్యూరో అధ్వర్యంలో గంజాయి, కల్తీ కల్లు వినియోగంతో జరిగే అనర్థాలపై రూపోందిన వాల్ పోస్టర్‌ను బుధవారం అధికారులతో కలిసి సీపీ అవిష్కరించారు. గంజాయి, కల్తీ కల్లు వినియోగంతో జరిగే అనర్థాలతోపాటు విక్రయాలకు పాల్పడితే ఫిర్యాదు చేయాల్సిన టోల్ ఫ్రీ నెంబర్‌తో ఈ అవగాహన పోస్టర్లను రూపోందించినట్లు ఆయన వెల్లడించారు. గంజాయి మహమ్మారి యువతను పట్టిపీడిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. గంజాయి అలవాటు పడిన యువత జీవితాలు విచ్ఛిన్నం కావడంతో పాటు తల్లిదండ్రులు మానసిక క్షోభకు గురవుతున్నారన్నారు. గంజాయి నిర్మూలనకు ప్రజలందరు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి మత్తు పదార్థాల విక్రయాలకు పాల్పడేవారి సమాచారాన్ని ఇవ్వాలన్నారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గొప్యంగా ఉంచుతామని హామీ ఇచ్చారు. అదే విధంగా మత్తు పదార్థాల కట్టడికి పోలీస్ అధికారులు మరింత శ్రమించించాల్సి ఉందన్నారు. గంజాయి రహిత కమిషనరేట్ మనందరి లక్ష్యం కావాలన్నారు. ఈ కార్యక్రమములో పరిపాలన అదనపు డీసీపీ రవి, ట్రైనీ ఐపీఎస్ శుభం నాగ్, వరంగల్ పోలీస్ కమిషనరేట్ యాంటీ నార్కోటిక్స్ బ్యూరో ఏసీపీ సైదులు, సీసీఆర్‌బీ ఏసీపీ డేవిడ్, యాంటీ నార్కోటిక్స్ బ్యూరో ఇన్స్‌స్పెక్టర్ సురేష్, సీసీఆర్‌బీ ఇన్ స్పెక్టర్లు గణేష్, శ్రీధర్ రావు తదితరులు పాల్గొన్నారు.








# తెల్లవారు జామున ఘోర రోడ్డు ప్రమాదం

## ఇద్దరు యువకుల మృతి

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** వడ్డేపల్లి క్రాస్ రోడ్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు మృతి చెందారు. ఈ విషాద ఘటన బుధవారం తెల్లవారుజామున జరిగింది. వివరాలలోకి వెళితే కాజీపేట నుంచి హనుమకొండ వైపు బైక్ పై వస్తున్న ఇద్దరు యువకులు రెవెన్యూ కాలనీ నుంచి వడ్డేపల్లి వైపు వెళుతున్న కారును బలంగా ఢీకొని పడిపోయారు. ఈ ప్రమాదంలో ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందగా మరొకరు ఆస్పత్రికి తరలిస్తుండగా మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. వీరు వరంగల్ పశ్చిమ నియోజకవర్గం కాజీపేట 63వ డివిజన్ కు చెందిన సయ్యద్ వహీద్, అశ్రఫ్ గా గుర్తించారు. ఈ ఘటనపై సుబేదారి పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. కాగా మృతుల కుటుంబ సభ్యులను మాజీ డీసీసీబీ చైర్మన్, తెలంగాణ స్టేట్ ఆయిల్ సీడ్స్ గ్రోవర్స్ ఫెడరేషన్ చైర్మన్ జంగా రాఘవ రెడ్డి పరామర్శించారు. వారి కుటుంబాలకు సానుభూతి తెలిపారు.







EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY GADDAM KESHAVA MURTHY, PRINTED AT MANIKANTA GRAPHICS, H.NO.4-10-121, KUMARPALLY, HANAMKONDA, WARANGAL URBAN DIST DISTRICT-506001, TELANGANA STATE, PUBLISHED AT H.NO. 4- 7-138/1, KUMARPALLY, HANAMKONDA, WARANGAL.-506001. WARANGAL URBAN DISTRICT, TELANGANA STATE.
EDITOR : GADDAM KESHAVA MURTHY. RNI NO: TELTEL/2021/80377, PHONE NO : 8008794162, MAIL ID : gaddamkeshavamurthy@gmail.com